ధరల మోత.. సామాన్యులకు వాత

- నిత్యావసర సరుకుల ధరలకు రెక్కలు
- పెట్రో ధరలదీ అదే పరిస్థితి
- నియంత్రణ చర్యలు చేపట్టని ప్రభుత్వాలు



నిత్యావసర సరుకులు



కూరగాయలు అమ్ముతున్న మహిళ

ఏలూరు (టూటౌన్) : ఆకాశానంటుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య ప్రజలు ఏం కొనేటట్టు.. తినేటట్టు లేవంటూ అల్లాడుతున్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్ల రేట్లు ఎన్నడూ లేని విధంగా మండిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు కూడా రోజు రోజుకు పైపైకి పోతున్నాయి. పెరుగుతోన్న ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవడంతో ప్రజలకు ధరాఘాతం తప్పడంలేదు.

జనాభా సుమారు 3 లక్షలు

ఏలూరు నియోజకవర్గంలో దాదాపు 3 లక్షల మంది జనాభా నివశిస్తున్నారు. లక్షకు పైగా కుటుంబాలు ఉన్నాయి. వీటిలో 90 శాతం కుటుంబాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే. వీరి సగటు ఆదాయం నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు లోపే ఉండటం గమనార్హం. పెరిగిన నిత్యావసరాల ధరల కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల ఖర్చు విపరీతంగా పెరిగి పోయింది. దీంతో సామాన్య, పేద ప్రజలు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

మండుతున్న ధరలు

రోజురోజుకూ నిత్యావసరాలు, కూరగాయలు ధరలు మండిపోతున్నాయి. మార్కెట్‌కు వెళ్లాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది. ఏ కూరగాయ ముట్టుకున్నా కిలో రూ.40 నుంచి రూ.80 పైనే ఉంది. ఉల్లిపాయలు కిలో రూ.40 నుంచి రూ.50 వరకు, టమాటాలు కిలో రూ.60 వరకు ఉంది. పప్పుదినుసులు అదేబాటలో పయనిస్తున్నాయి. కంది, మినప, పెసర, శనగ వంటి పప్పు దినుసులు కిలో రూ.120 నుంచి రూ.170కి చేరింది. మార్కెట్‌లో కంది పప్పు క్వాలిటీని బట్టి కిలో రూ.150 నుంచి రూ.170 ఉంది. మినుములు కిలో రూ.120 నుంచి రూ.165 వరకు విక్రయిస్తున్నారు. పొట్టు తీసిన మినపగుళ్లు క్వాలిటీవైతే రూ.200 వరకు అమ్ముతున్నారు. పెసర పప్పు కిలో రూ.110 నుంచి రూ.130 వరకు అమ్ముతున్నారు. శనగపప్పు సైతం కిలో రూ.90 పైనే విక్రయిస్తున్నారు. వేరుశనగ కిలో రూ.110 నుంచి రూ.130 వరకు, వెల్లుల్లి కిలో రూ.220 వరకు విక్రయిస్తున్నారు.

మాంసాహారాలకు రెక్కలు

సామాన్య, పేద ప్రజలు ఇష్టంగా తినే మాంసాహారాల ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్‌లో గత నెల రోజుల నుంచి కిలో చికెన్ ధర రూ.240 నుంచి రూ.260 పలుకుతుంది. కిలో మటన్ ధర రూ.750 నుంచి రూ.1000 పలుకుతుంది. సాధారణ చెరువు చేపల ధర సైతం కిలో రూ.150 నుంచి రూ.180 పలుకుతుంది. రొయ్యలు సైజులను బట్టి కిలో రూ.200 నుంచి రూ.450 వరకు అమ్ముతున్నారు. నల్ల జాతి చేపల రకాలైతే కిలో రూ.300 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. పెరిగిన కూరగాయల స్థానంలో అప్పుడప్పుడైనా మాంసాహారం తిందామనుకునే వారికి వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది.

ధరలను అరికట్టాలి



రోజు రోజుకు పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రెండు నెలల క్రితం నిత్యావసరాల ధరలు అందుబాటులోనే ఉన్నాయి. తాజాగా వీటి ధరలకు రెక్కలు వస్తున్నాయి. సామాన్య ప్రజలు నిత్యావసరాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధంగా నిత్యావసరాలు, కూరగాయలు అందుబాటులో ఉండే విధంగా పాలకులు చర్యలు చేపట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకుడు, ఏలూరు

కొనుగోలు శక్తి తగ్గింది



నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు కూడా బాగా పెరిగి పోయాయి. గతంలో వారానికి రూ.100 నుంచి రూ.150లు కూరగాయలపై ఖర్చయ్యేది. తాజాగా ఆ బడ్జెట్ రెట్టింపు అవ్వడంతో కూరగాయలను తక్కువగా కొనుగోలు చేస్తున్నాం. మినపగుళ్లు సైతం కిలో రూ.160 నుంచి రూ.200 ఉంది. దీంతో మినపగుళ్లు కొనేందుకు జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం కూరల దగ్గర సర్దుకు పోవాల్సి వస్తుంది.

– వెంపా విజయలక్ష్మి, గృహిణి, పాలగూడెం, ఏలూరు రూరల్ మండలం

పెరిగిన ధరలు



మునుపెన్నడూ లేనివిధంగా మార్కెట్‌లో అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయి. ఏమీ కొనలేని పరిస్థితి. ఇటు కూరగాయల ధరలు కూడా మండి పోతున్నాయి. రోజు రోజుకు ఉల్లిపాయల ధరలు పెరిగిపోతున్నాయి. అంగడిలో పప్పు దినుసుల ధరల పరిస్థితీ ఇలానే ఉంది. రెండు నెలల క్రితం వరకు బాగానే కొనగలిగే వారం. పెరిగిన ధరలతో ఉన్న దాంట్లో సంతృప్తి చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– కాటం వెంకటలక్ష్మి, గృహిణి, పాలగూడెం, ఏలూరు రూరల్ మండలం

క్లుప్తంగా

తల్లిపాలతోనే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి



తల్లులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): తల్లిపాలతోనే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని అంగన్‌వాడీ కార్యకర్త డి.వరలక్ష్మి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక 30వ డివిజన్ మోతేవారితోట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరలక్ష్మి మాట్లాడుతూ ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తితో పాటు విటమిన్-ఎ ఉంటుందని తెలిపారు. తల్లిపాలతోనే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు బిడ్డ మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గీత, ఆశావర్కర్ రేణుక, తల్లులు, బాలింతలు శలా కుమారి, సావిత్రి, రాధ తదితరులు పాల్గొన్నారు.

సెలవు కరదీపిక విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉండే విధంగా ముద్రించిన ఆపస్ సెలవు కరదీపిక పుస్తకాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ద్వారా ఆవిష్కరించామని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్‌వీకే రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక శనివారపు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గ దర్శనం



పంపుల సెంటర్ కనక దుర్గమ్మ



నాలుగు గుడుల సెంటర్ కనకదుర్గమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక 12 పంపుల సెంటర్‌లో ఉన్న కనకదుర్గమ్మవారి దేవస్థానంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు ఫలహారాలతో అమ్మవారిని అలంకరించినట్టు అర్చకుడు కందుకూరి రాజా తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.రీనా మాధురి కార్యక్రమాలు పర్యవేక్షించారు. స్థానిక పత్తేబాద నాలుగు గుడుల సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు పర్యవేక్షించారు.

మహిళా కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిప్రకాష్

ఏలూరు (టూటౌన్): మహిళా కుట్టు శిక్షణా కేంద్రాన్ని స్థానిక గన్‌బజార్‌లో దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు, వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు మహిళా కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, పలువురు దళిత సేన మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వరికి రూ.87,616 అందజేత



జ్ఞానేశ్వరి తల్లి దుర్గకు నగదు అందజేస్తున్న నారా శేషు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి జ్ఞానేశ్వరి వైద్య చికిత్స నిమిత్తం నగరానికి చెందిన ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జూట్‌మిల్లు వద్ద ధర్మభేరి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలిక తల్లి దుర్గకు రూ.87,616 నగదు అందజేశారు. ఎస్ ఫౌండేషన్ చైర్మన్ నారా వెంకట నరసింహమూర్తి, డైరెక్టర్ నారా శేషు కలిపి రూ.50 వేలు, హోటల్ ఎస్ సిబ్బంది రూ.10,116, శ్రీకృష్ణ సుజికి సిబ్బంది రూ.14 వేలు మరికొందరు దాతల సాయంతో ఈ మొత్తాన్ని సమీకరించి అందజేశారు. ఈ సందర్భంగా నారా శేషు మాట్లాడుతూ ప్రాణాపాయంలో ఉన్న చిన్నారిని ఆదుకోవడం మానవత్వమని, నగర ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల దాతలు కూడా జ్ఞానేశ్వరి చికిత్సకు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం



మున్నుల జాన్

ఏలూరు టౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఏలూరు కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ తెలిపారు. దీంతో రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది దళిత కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు వస్తాయని తెలిపారు.

జాతీయ జెండాల తయారీ ప్రారంభం



జాతీయ జెండాలను తయారు చేస్తున్న ఘంటసాల స్వరపీఠం సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతికి గర్వకారణమైన జాతీయ జెండాకు క్రయవిక్రయాలు ఉండకూడదనే నినాదంతో నగరానికి చెందిన ఘంటసాల స్వర పీఠం వ్యవస్థాపకుడు ఎస్‌ఎం సుభాని ఆగష్టు 15వ తేదీకి పాఠశాలలకు జెండాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు జెండాల తయారీని శుక్రవారం ప్రారంభించారు. మువ్వన్నెల జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 148వ జయంతిని ఏలూరు ఘంటసాల స్వర పీఠం ఆధ్వర్యంలో స్థానిక న్యూ అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవత కేంద్ర నియంత్రణ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఇన్నర్ వీల్ క్లబ్, మానవత సంస్థల సాయంతో ఏర్పాటుచేసిన కుట్టు మెషీన్లను ప్రారంభించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పని పాట అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆసక్తి గల వారికి దేశభక్తి గేయాలు నేర్పిస్తున్నట్టు సుభాని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసిన పశ్చిమగోదావరి జిల్లా మానవత అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, ఆర్మీలో పని చేసిన బీడీ నాగేశ్వరరావులను సత్కరించారు. వీరికి దేవరకొండ వెంకటేశ్వర్లు భారత రాజ్యాంగ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో వై.అర్జున రావు, శ్రీహరి కోటి, అడుసుమిల్లి నిర్మల, కొమ్మోజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి



కోనే సీతారామ్‌ను అభినందిస్తున్న జీపీ, ఏపీపీలు



నోముల రాముడికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఏలూరు బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఏపీపీలు, న్యాయవాదులు ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన పీడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్‌ను శుక్రవారం ఆయన ఆఫీసులో గవర్నమెంటు ప్లీడరు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు కలిపి శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలం జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విశేషమైన సేవలు అందించిన దివంగత కోనే రామ్మోహన రావు తనయుడు సీతారామ్ ఏలూరు బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సీతారామ్‌ను కలిసిన వారిలో జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ) బి.జగన్నాధరెడ్డి, జిల్లాలోని వివిధ కోర్టుల అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు ఆచంట వెంకటేశ్వరరావు, డీవీ రామాంజనేయులు, సీహెచ్ రాజేంద్ర ప్రసాద్‌లు సాలువా కప్పి పూల మొక్కతో సత్కరించారు. కార్యక్రమంలో మహిళా న్యాయవాదులు మాధవి, సంధ్యారాణి, సునీత, అనిత తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ సెక్రెటరీగా రాముడు

ఏలూరు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా నోముల రాముడు 42 ఓట్ల మెజార్టీతో గెల్లా శ్రీనివాసరావుపై గెలుపొందినట్టు ఎన్నికల అధికారి ఎంవీ నారాయణ రాజు తెలిపారు. ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా గత నెల 25న నామినేషన్లను స్వీకరించారు. అన్ని పదవులకు ఒక్కోనామినేషన్ దాఖలు కాగా ఒక్క జాయింట్ సెక్రెటరీ పదవి కోసం నోముల రాముడు, గెల్లా శ్రీనివాసరావులు పోటీ పడ్డారు. దీంతో ఈ నెల 2వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొత్తం 256 ఓట్లు పోలవ్వగా వీటిలో నోముల రాముడుకి 146, గెల్లా శ్రీనివాసరావుకు 104 ఓట్లు వచ్చాయని, మిగిలిన ఓట్లు చెల్లలేదని నారాయణరాజు తెలిపారు. జాయింట్ సెక్రెటరీగా గెలుపొందిన రాముడుని పలువురు న్యాయవాదులు అభినందించారు. కార్యక్రమంలో ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, నూతన అధ్యక్షుడు కోనే సీతారామ్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానాలో పడిగాపులు



బాధను ఓర్చుకుంటూ వైద్యం కోసం ఎదురుచూస్తూ



పిల్లల టీకాల కోసం పడిగాపులు కాస్తున్న బాలింతలు



రక్త పరీక్షలకు వచ్చిన గర్భిణులు

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు వైద్యం కోసం పడిగాపులు తప్పడంలేదు. ఓపీ దగ్గర నుంచి చికిత్స వరకు వెన్నుపూస అరిగే వరకు నిలబడాల్సిందే. ముఖ్యంగా తల్లీ పిల్లల వార్డులో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. గర్భిణుల నుంచి శిశువుల వరకు వైద్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. వ్యాధినిరోధక టీకాల కోసం బాలింతలు తమ బిడ్డలను తీసుకుని గంటల తరబడి కూర్చొంటున్నారు. నడవలేని పరిస్థితుల్లోనూ గర్భిణులు ఫస్ట్ ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు అపసోపాలు పడుతూ వస్తూ పోతున్నారు. వైద్యులు ఇకనైనా తమ వార్డుకు వచ్చి పిల్లలకు టీకాలు వేయడమో... లేదా వచ్చిన వెంటనే చూసి పంపించడమో చేస్తే బాగుంటుందని, గంటల తరబడి కూర్చోలేకపోతున్నామని బాలింతలు బాధపడుతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



ఓపీ వద్ద పడిగాపులు

విద్యార్థికి ఆర్థిక సాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఒక విద్యార్థికి ఫీజు కట్టి తిరిగి చదివే అవకాశం కల్పించిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం అన్నారు. పెదవేగి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన మానికొండ వెంకటేశ్వరరావు తన తండ్రి ఇటీవల మృతి చెందగా తల్లి అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ భారం మోస్తూ తన డిగ్రీ చదువుకు ఫీజు కట్టలేక చదువును మధ్యలో ఆపేశాడు. దీంతో వెంకటేశ్వరరావుకు ఫీజు కట్టేందుకు సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తరపున రూ.10 వేల ఆర్థిక సాయం శుక్రవారం డీఈఓ అబ్రహం ద్వారా అందజేశారు. అలాగే ఏలూరులో ఏఎన్‌ఎం కోటం దుర్గ కుమార్తె జ్ఞానేశ్వరి (11) కాలేయ వ్యాధి వైద్యం నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సాయి హెల్పింగ్ అండ్ సభ్యులు జి.ప్రకాష్, పి.వెంకటరమణ, జి.కృష్ణ, సీహెచ్ శ్రీధర్, గుంటూరు శ్రీనివాసరావు, జి.మోహన్, ఎ.త్రినాథరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

వ్యక్తి ఆత్మహత్య



భాస్కరరావు మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ కొత్తపేట ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొత్తపేటకు చెందిన భాస్కరరావు సోఫాలు రిపేర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శుక్రవారం భార్యతో కలిసి దైవదర్శనానికి వెళ్దామని చెప్పిన భాస్కరరావు భార్యను గుడికి పంపి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో ట్రాఫిక్‌పై ఎస్పీ పరిశీలన



ఏలూరు నగరంలో బుల్లెట్ నడుపుతూ ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ స్వయంగా రంగంలోకి దిగారు. బుల్లెట్ బండెక్కి హెల్మెట్ ధరించి, స్వయంగా ఆయనే డ్రైవ్ చేస్తూ ఏలూరు నగరంలో పరిశీలన చేశారు. ఎస్పీ కార్యాలయం నుంచి ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సెంటర్, ఆర్‌ఆర్ పేట, పవర్‌పేట, ఏలూరు పాత బస్టాండ్, ఆదివారపు పేట, కంద్రికగూడెం సెంటర్, తంగెళ్లమూడి, అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఏలూరు కొత్తబస్టాండ్, శాంతినగర్ ఇలా నగరాన్ని బుల్లెట్‌పై తిరుగుతూ పరిశీలించారు. నగరంలో ఎక్కడ ట్రాఫిక్ రద్దీ ఉంటుందో పరిశీలిస్తూ.. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు ట్రాఫిక్ సర్కిల్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నగరంలోని రోడ్లు, ట్రాఫిక్ పాయింట్లను రేఖాచిత్రంలో పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావును ఆదేశించారు. ఎస్పీతోపాటు ఏలూరు నగరపాలక డీఈ తాతబ్బాయి, ఎస్‌బీ సీఐ బి.ఆదిప్రసాద్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.